క్లుప్తంగా

ఘనంగా కుసుమకుమారి దేవి జయంతి



కుసుమ హరనాథ సన్నిధిలో పూజలు చేస్తున్న ఆశ్రమ కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్: రాజీవ్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో మాతృశ్రీ కుసుమ కుమారిదేవి జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరంలోని కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం కుసుమ కుమారిదేవికి మంగళ ధ్వని, ఘంటానాదం, వేద మంత్రాలతో పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించి ఏకాహం, ఉయ్యాల ఉత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కోశాధికారి ఎస్.అన్నాజీరావు, సంయుక్త కార్యదర్శి కె.మంగరాజు, ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్షణగిరిపై నవదిన ప్రార్థనలు



కొవ్వొత్తులతో దీపారాధన చేస్తున్న మహిళలు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పునీత పేతురి చర్చి ఫాదర్ రెవరెండ్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్స్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం నవదిన ప్రార్థనలు ఘనంగా ప్రారంభించారు. ఉదయం 4 గంటలకు కొవ్వొత్తులతో జ్ఞానాపురం వీధుల్లో ప్రదక్షిణ చేశారు. ప్రత్యేక ప్రార్థనలకు అతిథులుగా ఆర్చిబిషప్ మరియదాస్, బిషప్ పాల్ మైపాన్, ఫాదర్ వేళంగిణిరాజు పాల్గొని దీపారాధన ప్రారంభించారు. అనంతరం బాబుకాలనీ, జేఎస్ఎన్ఆర్‌యూఎం కాలనీల్లో మహిళలు కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. క్రీస్తు రాకకోసం ప్రజలు భక్తిశ్రద్ధలతో మెలగాలన్నారు. నవ దినాలు జరిగే దీపారాధనలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. ప్రసంగాల అనంతరం దివ్యబలి పూజలు చేశారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సేవలు గుర్తించండి



భీశెట్టి వసంతలక్ష్మికి రోజా పువ్వు ఇచ్చి విజ్ఞప్తి చేస్తున్న సచివాలయ కార్యదర్శులు

అల్లిపురం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవం కాపాడాలని కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మిని 33వ వార్డు సచివాలయ కార్యదర్శులు కోరారు. సోమవారం వార్డు సచివాలయ కార్యదర్శులు అంతా ఆమెను కలిసి రోజా పువ్వు ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో తమ సేవలను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కార్యదర్శులు రేణుక, తులసి, నూర్జహాన్ బేగం, హారిక, కృష్ణ, కుమారి, గీత, రమాదేవి, చిరంజీవి, రియాజ్‌ఖాన్, చంద్రశేఖర్, పీవీ కిరణ్‌కుమార్, రమ్య, పార్వతి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు ఏఎంసీ విద్యార్థి ఎంపిక



రామాంజనేయులకు పత్రం అందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ 2019 బ్యాచ్ (హౌస్ సర్జన్) విద్యార్థి జె.వి.రామాంజనేయులు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య శాస్త్ర విశ్వవిద్యాలయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. డిసెంబర్ 21 నుంచి 28 వరకు కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో జరగనున్న దక్షిణ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో రామంజనేయులు పాల్గొనబోతున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు, తదితరులు రామంజనేయులును అభినందించారు. అనంతరం ఎంపిక పత్రం అందజేశారు.

బడికి దూరంగా బాల్యం



- చదువుకునే వయసులో పిల్లలపై పనిభారం
- బెగ్గింగ్, చిత్తుకాగితాలు, ఇనుప ముక్కలు ఏరుకుంటూ రోడ్లపై తిరుగుతున్న కొందరు బాలలు
- సామగ్రి విక్రయిస్తున్న మరికొందరు..
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రశ్నార్థకం!



కేజీహెచ్ డౌన్ రోడ్డులో చపాతీ చేసుకునే పరికరాలు విక్రయిస్తున్న బాలుడు

డాబాగార్డెన్స్: చదువుకునే వయసులో పలువురు చిన్నారులు విద్యకు నోచుకోవడం లేదు. సరదాగా తోటి పిల్లలతో ఆడుకోవాల్సిన బాలలు కుటుంబ భారాన్ని మోస్తున్నారు. జనరేషన్ మారుతున్నా.. దానికి అనుగుణంగా కొందరు తల్లిదండ్రుల్లో మార్పు రాకపోవడంతో పిల్లలు బలవుతున్నారు. చిన్న వయసులోనే కుటుంబాన్ని మోస్తూ.. జీవితంలో అక్షర జ్ఞానాన్ని కోల్పోతూ.. చివరకు చదువుల తల్లి సరస్వతికి దూరమై అనేక ఇబ్బందులకు గురైన వారు ఎందరో ఉన్నారు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు అనేక చర్యలు చేపట్టింది. బడి ఈడు పిల్లలు బాల కార్మికులుగా ఉండరాదన్న సదుద్దేశంతో చైల్డ్ కేర్ ఫౌండేషన్.. పిల్లల భద్రతపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వాలు కూడా బాల కార్మిక వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలనే మంచి ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టింది. అయినప్పటికీ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రశ్నార్థకంగానే మిగిలింది.

పొట్టకూటి కోసం వచ్చి..

రాష్ట్రం కాని రాష్ట్రం(నార్త్ ఇండియా) నుంచి పొట్టకూటి కోసం పలువురు విశాఖకు వలస వచ్చారు. వీరంతా గుడారాలు.. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు.. జాతీయ రహదారికి ఇరువైపులా ఆశ్రయం పొందుతూ చేతి పనిముట్లు, గృహోపకరణాలు చేస్తూ విక్రయిస్తున్నారు. పలువురు వారి పిల్లలచే కూడా వాటిని విక్రయిస్తూ పిల్లలను విద్యకు దూరం చేస్తున్నారు. ఇదే తరహాలో కేజీహెచ్ డౌన్ రోడ్డులో ఉత్తర భారతదేశానికి చెందిన ఓ చిన్నారి చపాతీలు తయారు చేసుకునే పనిముట్లు విక్రయిస్తూ 'సాక్షి' కంటపడ్డాడు. బడికి దూరమై వివిధ పనులు చేస్తున్న బాలలు ఇలా ఎందరో ఉన్నారు.

ఇనుప ముక్కల కోసం..



కాలువలో ఇనుప ముక్కలు ఏరుతున్న బాలలు

ఇద్దరు బాలలు ఇనుప ముక్కలు ఏరుకుంటూ కాలువల వెంట తిరుగుతూ విద్యకు దూరమవుతున్నారు. పెద్ద పెద్ద కాలువల్లో దిగి కుటుంబ పోషణకు ఇనుప ముక్కలు ఏరుకుంటూ ఇద్దరు బాలలు జీవీఎంసీ 37వ వార్డు జబ్బరతోట పరిసర ప్రాంతాల్లో 'సాక్షి' కంటపడ్డారు. కొందరు పిల్లలు చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ రోడ్లపై తిరుగుతున్నారు.

తల్లికి తోడుగా..



బెగ్గింగ్ చేసుకునే తల్లి వెంట చిన్నారి

ఓ తల్లి తన కుటుంబ పోషణకు ఓ కోతిని పట్టుకుని ఊరూరా తిరుగుతూ బెగ్గింగ్ చేసుకుంటోంది. అది చాలక తన చిన్నారిని కూడా వెంటపెట్టుకుని బెగ్గింగ్ చేస్తున్న తీరును చూసి పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పరిధిలో ఇటువంటి వారు ఎందరో చదువుకు దూరమవుతున్నారు. ఇటువంటి వారిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విద్యకు దూరం చేస్తున్న వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సిరులతల్లి దర్శనం.. తరించిన భక్తజనం



విశేష అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 15వ రోజు సోమవారం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు. విశాఖ జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతా, క్షీరాభిషేకాలు, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవ

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొన దలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081 పేరిట చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, వాట్సాప్ నంబర్ 89855 15989కు, లేదా మెయిల్ ఐడీ dceoskmlad@gmail.com ద్వారా పంపవచ్చు.

1500 మందికి అన్నదానం

టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి విభూతి యోగం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : వేదాంత ఇన్‌స్టిట్యూట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 22 వరకు భగవద్గీత 10వ అధ్యాయంపై ప్రవచనాలు, ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధి సత్యానంద తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా నిర్వహించనున్న కార్యక్రమం పూర్తిగా ఉచితమన్నారు. రోజూ సాయంత్రం 6.30 నుంచి 7.45 వరకు జరుగుతుందని తెలిపారు. యోగా సుప్రీం మేనిఫెస్టేషన్ (విభూతి యోగం)పై ఇంగ్లిష్‌లో నిర్వహించే ప్రవచనాలు 42 శ్లోకాలతో ముడిపడి ఉన్నాయన్నారు. స్వామి పార్థసారథి శిష్యురాలైన సుశీలాజీ ప్రవచనాలు బోధించనున్నారని తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా ప్రాచీన కాల వేదాంత శాస్త్రాన్ని ఆమె అభ్యసిస్తూ ఎన్నో పరిశోధనలు చేశారన్నారు. మన భారతదేశ సనాతన ధర్మంలో అతి ముఖ్యమైన భగవద్గీత గూర్చి విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలన్నారు. సమావేశంలో హరినాథ్ రాజు, రావు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



గోదాదేవి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి, గోదాదేవి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం ధనుర్మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున సుప్రభాత సేవ, తిరుమంజన సేవ, అలంకరణ, ఆరాధన, మంగళాశాసనము, తీర్థ ప్రసాద పంపిణీ చేపట్టారు. ఉదయం 6.45 గంటలకు అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా గోదాదేవి, రంగనాథుల విగ్రహాలను విశేషంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో ఆలయ పరిసర ప్రాంతాల్లో మంగళవాయిద్యాలు మధ్య తిరువీధి నిర్వహించి ధనుర్మాస ఉత్సవ సంకల్పం చేపట్టారు. విశేష అలంకరణ, నివేదన అనంతరం నెల గంటతో ఆలయంలో భక్తులు, సిబ్బంది పూజలు చేశారు. ఈ సందర్భంగా తిరుప్పావై పఠనం, సేవాకాలం, వేదపఠనం, హారతి, మంగళాశాసనము, శాత్తుమురై మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

21న జీవీఎంసీ దుకాణాలకు వేలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–4 పరిధిలోని పలు వాణిజ్య సముదాయాల దుకాణాలు, కల్యాణ మండపం, మార్కెట్లకు ఈ నెల 21 బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 35వ వార్డు స్ప్రింగ్ రోడ్డు సమీపాన డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో 9, 10, 11, 12, 13(జనరల్), 15(ఎస్సీ), మొదటి అంతస్తులోని దుకాణం నంబర్లు 2(ఎస్సీ), 3, 4, 5, 6, 7, 9, 10, 11, 12, 13, 14, 15(జనరల్)కు, జగదాంబ వాణిజ్య సముదాయంలోని గదులు 3, 5, 13, 14(ఎస్టీ)కు, 35వ వార్డు పాత బస్టాండ్ ఫేస్–2లోని 1, 2, 3, 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 14(ఎస్సీ), 9(ఎస్టీ), 39వ వార్డు పద్మానగర్ వాణిజ్య సముదాయంలోని 1, 4, 6, 7, 11, 12(జనరల్), 8(ఎస్సీ)గదులు, 31వ వార్డు సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం ఫస్ట్ ఫ్లోర్‌లోని దుకాణం నంబర్ 9, 37వ వార్డులో అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు మార్కెట్, రెల్లి వీధి రోడ్‌సైడ్ మార్కెట్లను బహిరంగ వేలం ద్వారా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు ధరావత్తు సొమ్ము తదితర వివరాల కోసం జోనల్ కార్యాలయ పనివేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని కోరారు.

ప్రజా సహకారంతో కాలుష్య రహిత నగరం



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వాహనాలను ఒక రోజు సహకరించాలని కోరారు. ఆరిలోవ పెదగదిలిలోని క్యాంప్ ఆఫీస్ నుంచి సోమవారం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు రవాణా వ్యవస్థను, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

జీవోలతో ఆటోడ్రైవర్లపై భారం మోపొద్దు



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారం మోపే జీవో నంబర్ 21, 31లను రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో భాగంగా బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వామనమూర్తి మాట్లాడుతూ సదరు రెండు జీవోల కారణంగా ఆటో డ్రైవర్లు పలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలను ఫిబ్రవరిలో జరిగే శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు యు.శివాజీ, నాయకులు ఎస్.మధు రెడ్డి, భాస్కర్, దేముడు పాల్గొన్నారు.

41వ వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో పలు సమస్యలపై కమిషనర్ సంపత్ కుమార్‌కు స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ సోమవారం వినతిపత్రం అందించారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ఫుట్‌పాత్‌లపై అనధికారికంగా బడ్డీలు ఏర్పాటుతో ఎదురవుతున్న ఇబ్బందులు, వార్డులో సక్రమ కట్టడాలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అడ్డుకుని అక్రమంగా నిర్మిస్తున్న వాటిని వదిలేయడంపై వినతిపత్రంలో పేర్కొన్నారు. వార్డులో అభివృద్ధికి కూటమి ప్రభుత్వ నాయకులు ఆటంకం కలిగిస్తున్నారని వాపోయారు. వార్డులో దళారీ వ్యవస్థ నడుస్తోందని, కొంత మంది వ్యక్తులు అనధికారికంగా డబ్బులు వసూలు చేసి ఇటువంటి పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు కార్పొరేటర్ పూర్ణిమ దృష్టికి రావడంతో ఆమె స్పందించి కమిషనర్‌ను కలిశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన గళం



నరేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని నిరసన తెలుపుతున్న మత్స్యకారులు



బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతున్న శానిటేషన్ వర్కర్లు

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం పలువురు నిరసన కార్యక్రమాలు చేపట్టి.. తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌నకు బలైన సూరాడ నరేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుని, లోన్ యాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా తమకు ఎటువంటి న్యాయం జరగలేదని, తాము రోడ్డున పడ్డామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు నరేంద్ర భార్యకు అర్హతకు తగ్గ ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నరేంద్ర భార్య అఖిలదేవి, మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు..

బకాయి వేతనాలు చెల్లించండి

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శానిటేషన్ వర్కర్లకు ఐదు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన చేపట్టారు. అసోసియేషన్ నాయకురాలు పి.మణి మాట్లాడుతూ బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. 50 మంది విద్యార్థులకు ఒక శానిటేషన్ వర్కర్‌ను నియమించాలని, మాస్కులు, చీపుర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాజకీయ కక్ష సాధింపులు ఆపాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఉపాధి కల్పించాలని నిరసన తెలుపుతున్న ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమ కాంట్రాక్ట్ కార్మికులు

ఉపాధి కల్పించండి

ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమను రీఓపెన్ చేసి ఉపాధి కల్పించాలని కాంట్రాక్ట్ వర్కర్లు ఆందోళనకు దిగారు. ఎల్.జి.పాలిమర్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ అసోసియేషన్, ల్యాండ్ లోజర్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉపాధి లభిస్తుందని తమ తాతలు, ఇతర పెద్దలు పరిశ్రమకు భూములిచ్చారని, పరిశ్రమను మూసివేయడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎల్జీ పాలిమర్స్ పరిశ్రమ కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

సోదరుని చెంతకు మహారాష్ట్ర యువకుడు



సోదరుడికి సురేష్‌ను అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ బృందం

సీతమ్మధార: మహారాష్ట్ర వాసిని సోదరుడికి అప్పగించినట్టు ఏయూటీడీ సంస్థ సోమవారం తెలిపింది. వివరాలిలా వున్నాయి. మహారాష్ట్రలోని తన గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న సురేష్ అనే వ్యక్తి నాలుగేళ్ల క్రితం తల్లి మృతితో ఆందోళన చెంది మానసిక అనారోగ్యానికి గురయ్యాడు. ఏడాదిపాటు ఇండోర్ ఆస్పత్రిలో చికిత్స కూడా పొందాడు. కానీ ఫలితం లేకపోవడంతో అతని భార్య కూడా వదిలిపెట్టి వెళ్లిపోవడంతో అక్కడి నుంచి వైజాగ్ వచ్చేశాడు. అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్న సురేష్‌ను జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి విశాఖ రైల్వేస్టేషన్‌లో గుర్తించి ద్వారకానగర్ టీఎస్సార్ కాంప్లెక్సులోని షెల్టర్‌కు తరలించారు. ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ వైద్య సేవలు అందించడంతో సురేష్ మానసిక స్థితి మెరుగైంది. దీంతో శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు సురేష్‌ను వైజాగ్ నుంచి క్షేమంగా తీసుకెళ్లి మహారాష్ట్రలోని బుల్దాన జిల్లా కుర్హా నగరంలో ఉన్న సోదరుడు గోకుల్‌కు అప్పగించారు.

హార్బర్‌లో కేంద్ర బృందం పర్యటన



ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థలో కేంద్ర వాణిజ్య విభాగం ప్రతినిధులు

మహారాణిపేట: ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి పరిశీలన నిమిత్తం కేంద్ర వాణిజ్య విభాగం ప్రతినిధులు దీపాంగన, జయత సోమవారం ఫిషింగ్ హార్బర్‌లో పర్యటించారు. కేంద్ర మత్స్య సంస్థ ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియాను సందర్శించారు. విశాఖలో మత్స్య ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్, ఎక్స్‌పోర్టులు తదితర విషయాలను ఈ బృందం పరిశీలించింది. హార్బర్‌లో బోటు యజమానులు, ఎగుమతిదారులతో చర్చించింది. పలు విషయాలపై ప్రతినిధులు సలహాలు స్వీకరించారు. పర్యటనలో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, ఎంపెడా ప్రతినిధి హనుమంతరావు, జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి, సైంటిస్టులు ప్రసాద్, రమ్య, మత్స్య శాఖ ఎఫ్‌డీవో మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్ – 4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. కార్యాలయంలో సోమవారం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలపై వచ్చిన ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదన్నారు. సమస్య పరిష్కరించిన తర్వాత సంబంధిత ఫోన్ నంబర్ ద్వారా సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, రెవెన్యూ అధికారులు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలీఫ్లవర్ @ రూ.20



జగదాంబ: కార్తీక మాసం, వనభోజనాలు, పెళ్లిళ్ల హడావుడి తగ్గడంతో కాలీఫ్లవర్ ధర దిగొచ్చింది. గత నెలలో అధికంగా రూ.50 నుంచి రూ.70 వరకు ఉండే దీని ధర హఠాత్తుగా తగ్గిపోయింది. మార్కెట్‌తోపాటు వీధుల్లో రూ.20కే కాలీఫ్లవర్ లభిస్తోంది. డిమాండ్ ఉన్న రోజుల్లో ఎగబడి కొనుగోలు చేసుకున్న వినియోగదారులు.. ఇప్పుడు తక్కువ ధరకు లభిస్తున్న కనీసం కన్నెత్తి చూడటం లేదు. అమ్మకాలు జరగక మిగిలిపోయిన కాలీఫ్లవర్లను కొందరు వ్యాపారులు కాలువల్లో పారేస్తున్నారు.